





(రచనా కాలం -1969)

చెట్టు ఆకు సందుల్లోంచి ఓ సారి తొంగి చూసి అతనొక్కడూ తప్ప మరెవ్వరూ లేరని నిర్ణయించుకుని అల్లరి చేయకుండా మెల్లిగా ఊడలా కిందకు దిగి అతని ముందు నుంచుంది వెన్నెల.

క్షణకాలం నిశ్శబ్దంగా ఉండిపోయింది. అతనలాగే తన ఉనికిని కూడా గుర్తించకుండా చెట్టుకి ఒదిగి కళ్ళు మూసుక్కూర్చోవటం ఆశ్చర్యం కలిగించింది. మరో నిమిషం అలానే ఉండి తరువాత అతణ్ణి తట్టి లేపింది.

అతను కళ్ళు తెరిచి తన ఎదురుగా ఆకుల మధ్య నుంచీ నిలుచున్న వెన్నెలని, "ఎవరూ?" అని అడిగేడు.

"నేను... వెన్నెలని!" అన్నది వెన్నెల సిగ్గుతో మెల్లిగా తలదించుకుంటూ.

వెన్నెల తలదించుకోవటం అతనికి నచ్చలేదు. వెనక్కి చెట్టు బోదెనానుకుని నిట్టూర్చటం విని వెన్నెల తలెత్తి అతన్ని చూస్తూ అన్నది...

"పదిరోజుల్నించీ చూస్తున్నాను. ఆవేదనతో నిట్టూర్చటం; లోలోపలే వెక్కి వెక్కి ఏడ్వటం తప్ప మీరు ఇంకేమీ చేయటంలేదు. - ఇక్కడికి, ఈ కాలవ వడ్డుకి వచ్చి! కారణాలు ఊహించేంత జ్ఞానం నాకు లేదనే నేననుకోవటం..."

క్షణం ఆగి ఓసారి అటూ ఇటూ చూసింది.

అతను అలాగే బోదెనానుకుని ఆశ్చర్యంగా వెన్నెలకేసి చూస్తూ అన్నాడు - "అయితే నెలరోజులుగా నన్ను ఎవరూ కనిపెట్టటం లేదని పొరబడ్డానన్నమాట. నిజం! నాకింతవరకూ తెలియదు - నన్ను చూసేవాళ్ళు ఇంకొకళ్ళు ఉంటారని. ఎందుకంటే నేననుకునే రాధిక మొన్నటి వరకూ నన్ను ప్రతి విషయంలోనూ కనిపెట్టి ఉండేది. కానీ దురదృష్టం, ఆమె నాకింక లేదు..."

ఈసారి వెన్నెలకాశ్చర్యం వేసింది.

"నుంచునే ఉన్నావు కూర్చో!" అన్నాడతను.

వెన్నెల మాట్లాడలేదు "ఫరవాలేదు... కూర్చో! ఎంతసేపనినుంచుంటావు."

వెన్నెల అతని ముందు పచ్చికలో ఒదిగి కూర్చుంది.

అతను కాళ్ళు చాచి చేతులు వెనక్కి నెట్టి ఆకుల్లోంచి - వెలుగుతో ప్రకాశిస్తున్న చంద్రుడి వంక చూశాడు. క్షణం ఏమీ మాట్లాడలేదు.

వెన్నెల అతని ముందు ముడుచుకుని పువ్వుల కుప్పలా, వెలుగు ముద్దలా తలొంచుకుని అతనికేసి ఓరగా చూస్తూ కూర్చుంది.

"చంద్రుడికి నువ్వులా, నాకు రాధిక ఉందనుకునేవాణ్ణి...." అతనలాగే చంద్రుడి వంక చూస్తూ అన్నాడు.

వెన్నెల తలెత్తి అతనికేసి చూసింది.

"అవును. మొన్నటి వరకూ నేనూ, రాధికా అలాగే ఉండేవాళ్ళం. ప్రపంచంలో నాకు రాధిక తప్ప మరెవ్వరూ లేరు..."

వెన్నెల అతనికేసి కళ్ళప్పగించి చూడ్డం అతనికి నచ్చలేదు.

"నిజంవే! రాధిక అసలు ఎవరో చెప్పకుండానే నీకీ విషయాలన్నీ చెప్పడం పొరబాటే! రాధిక నాకు మేనమామ కూతురు. నాకు చిన్నప్పటినుంచీ కూడా ఆత్మీయురాలిగా ఉన్నది కూడా ఒక్క రాధికే. నా తల్లీతండ్రీ నే బుద్దెరక్కముందే నాకు దూరమయ్యారు. ఆ తరువాత ఇప్పటికీ నాకు మనిషిలా ఉండి, బ్రతకడం నేర్పించింది రాధికే! అందుకే నాకు రాధికంటే ప్రేమ. అసలు ప్రేమ ఏమిటో కూడా తెలియచెప్పిందీ.. ఆవిడే!... నిజం! వెన్నెలా! నీకు తెలుసో .. తెలియదో గానీ.. నాకు బ్రతకడంలో కలలు కనడం నేర్పింది ఆమే..."

"నాకప్పుడప్పుడూ అనిపించేది. ఆ భగవంతుడే గనక ఎదురొచ్చి నీకీ ప్రపంచంలో ఏం కావాలని అడిగితే ఓసారి భగవంతుణ్ణి చూసి పిచ్చిగా గొంతెత్తి నవ్వాలని ఉండేది. లేకపోతే.. రాధికే నాకు ప్రపంచం అయినప్పుడు ఇంక నేనేం కోరుకుంటాననీ....?"

క్షణం ఆగి చటుక్కున నవ్వాడతను.

వెన్నెల ఉలిక్కిపడింది. అతనెందుకు నవ్వేడో వెన్నెల కర్ధం కాలేదు.

"ఇప్పుడనిపిస్తోంది. నిజంగా భగవంతుడలా నన్నడిగినప్పుడు నేనలా ప్రవర్తించకుండా ఉండాలని, గర్వంగా ఎదురు చెప్పకూడదని! కనీసం 'రాధికను నాకు దూరం చేయకు స్వామీ' అనయినా బ్రతిమాలాలని!" అంటూ తలొంచుకున్నాడు.

అతనలా కన్నీరు కార్చటం వెన్నెలకి బాధ కలిగించింది.

"మీరిలా కృంగిపోవటం బాగోలేదు. మీకింతకన్నా ఏం చెప్పను?" అన్నది.

అతను కన్నీళ్ళు నిండిన కళ్ళని ఎత్తి వెన్నెలకేసి చూసేడు.

"నాకు వేళయింది. మళ్ళీ కలుస్తాను - ఇలాగే రేపు! సెలవు" అంటూ లేచి ఆకుల్లోంచి చంద్రుడికేసి వెళ్ళిపోయింది వెన్నెల.

మర్నాడు -

మబ్బు కమ్ముకున్నప్పుడు

అసలు రావలసిన వేళకన్నా ఇంకాస్త ఆలస్యం అయింది - వెన్నెలకి చెట్టు కిందకు వచ్చేందుకు!

తననుకున్నట్టుగా అతను ముందు రోజులా చెట్టుబోదెనానుకుని లేడు.

పదిరోజులుగా అలవాటుపడిన వ్యక్తి ఆ వేళప్పుడు అక్కడ కూర్చుని లేకపోవటం వెన్నెలకి ఆశ్చర్యం కలిగించింది.

ఓసారి చుట్టూ కలియజూసింది. చెట్టుకి తూరుపు వేపు కాలవ్వొడ్డున ఇసుకలో వెల్లకిలా, ఆకాశంలో చంద్రుడిలో తన ఆలోచనల నీడల్ని వెదుక్కుంటూ పడుకున్న అతను కనిపించేడు.

వెన్నెల కప్పుడు - అతనక్కడ ఇసుకలో పడుకున్నందుకు ఆశ్చర్యం కన్నా ఇంకేదో అనిపించింది.

అందుకే -

"అరె! మీరు అక్కడున్నారా?" అని అన్నది.

అతను వెన్నెల పలకరింపుకు లేచి కూర్చున్నాడు. ఆ మాట అతనికి ఆ కాలువ నీటికి మల్లే గలగలల శబ్దంలా, సంగీతంలో అతనికి వెన్నెల మాటల కన్నా రాధిక మాటలే వినిపించాయి.

అతను లేచి కూచున్నంత లోపలే వెన్నెల ఇసుకలోకి అతనికి దగ్గరగా వచ్చి కూర్చుంది.

"పాత చోటు మార్చారేం?" ముడుచు క్కూర్చుంటూ అన్నది వెన్నెల.

"పాత బ్రతుకు పాతచోటునే పాతిపెట్టాను. నీకీ రోజు మంచి శుభవార్త చెబుతాను వెన్నెలా! నిన్నసలు మనం మాట్లాడుకోకుండానే కాలం మనల్ని నిలదీసింది - నన్నూ రాధికను విడదీసినట్టు. అయినా మళ్ళీ నువు వచ్చావు. విడిపోయిన నీకులాగే మళ్ళీ రాధిక నాకు దొరికింది. నువు నమ్మవు కదూ! నిజం వెన్నెలా!

"రాధిక నాకు దూరమయిన మాట ఒకరకంగా అబద్దమయ్యిందిరోజున. తనే చెప్పింది. లోకం కోసం, సంఘం కోసం తనతన్ని పెళ్ళి చేసుకుందనీ చెప్పింది. మొన్నప్పుడో నేను పట్నం వెళ్ళినప్పుడు యువ్వనంలో కాలుజారి చలపతికి దగ్గరయినందుకు పెళ్ళి చేసుకోవలసి వచ్చిందనీ పశ్చాత్తాపపడింది.

నువు నమ్మవుగానీ వెన్నెలా! రాధిక ఇవాళ ఎంత బాధపడిందని? నిజానికి చలపతిని పెళ్ళి చేసుకున్నదన్నమాటే కాని, నామీదే తనకు ప్రేమ ఉందనీ, తన జీవిత కాలం నా జీవననావలోనే గడుపుదామన్నదే తన ఆలోచనట. నిజంగా నాకే జాలేసింది. అప్పట్లో, ఆ పరిస్థితుల్లో ఎవరయినా అంతే చేస్తారేమో! ఏమో ఏమిటి? నేనయితే అలాగే చేసేవాణ్ణి! రాధిక నన్నుకాదని చలపతిని పెళ్ళిచేసుకోవటం తప్పని సరయింది. అందుకు నేనిప్పుడు బాధపడటం లేదు..."

వెన్నెల నిశ్చేష్టితయ్యింది.

అతను చెప్పుకుపోతున్నాడు.

"మొదట నేను నమ్మలేదులే! కానీ నిజంగా నా మీద తనకి ప్రేమ ఉన్నట్టూ, అందుకు నిదర్శనంగా తనని తాను సమర్పించుకునేందుకివాళ ఈ కాలువవడ్డుకి వస్తానంది.

నిజం వెన్నెలా! ఇన్ని సంవత్సరాలుగా నేను ఎన్ని సార్లు అనుకున్నాను - రాధిక యవ్వనంతో ఆడుకోవాలనీ, రాధిక మనసులో నిలిచిపోవాలనీ, రాధికలో లీనమయిపోవాలనీ, నా కలలన్నీ ఇవాళ ఈ కాలవ్వొడ్డున నీ వెలుగులో తీరతాయి. రాధిక నా కోసం ఇంకాసేపట్లో ఇక్కడికి వస్తుంది. నీకు రాధికను పరిచయం చేస్తానుగా? చూద్దువుగాని! నిన్నటివరకూ నాది కాకుండా పోయిందన్న అందం ఇంకాసేపట్లో నా చేతిలో గులాబీ పువ్వయిపోతుంది. పిచ్చెక్కి రాధికను మోహావేశంతో కౌగిలించుకుంటాను. ఈ లోకంలో నా జీవితానికల్లా ఎక్కువయిన ఆనందాన్ని ఈ రాత్రి అనుభవిస్తాను. ఆమె యవ్వనాన్ని మధువులా తాగేస్తాను. నన్ను నమ్ము వెన్నెలా! నేనటం కాదుగానీ... చూస్తావుగ..."

నవ్వుతున్న అతడిని చూస్తుంటే వెన్నెలకి పిచ్చెక్కిపోయేలా అనిపించింది. అటూ ఇటూ చూసింది. అడ్డువస్తున్న మబ్బుని చూసి వెన్నెల చటుక్కున లేచి చంద్రుడికేసి పరుగెత్తి వెళ్ళిపోయింది.

ఎంతకీ మబ్బు తునక అడ్డుతొలగనందుకు కాస్సేపు అతని గురించి కన్నా ఆమె గురించి - రాధిక గురించి ఆలోచించాలనిపించింది.

అగ్నిసాక్షిగా పవిత్రంగా పెళ్ళాడిన భర్తను కాదని, తన సర్వస్వం తన స్త్రీత్వం అర్పించిన భర్తను కాదని మరో మగాడికి దాసోహం అయ్యేందుకు సిద్ధపడిన ఆమెను తప్పకుండా చూడాలనిపించింది వెన్నెలకి!

మబ్బుతెర తొలగినప్పుడు రాధికను చూడాలన్న అత్యంతాశతో నేలకేసి పరుగెత్తి వెళ్ళి, కాలవ వడ్డున అతనామెని గొంతు నులిమి చంపుతూండటం కనిపించి ఆశ్చర్యపోయింది వెన్నెల!



ప్రముఖ చిత్రకారుడు చంద్ర గారి గురించి కౌముది పాఠకులకి వేరుగా పరిచయం చేయాల్సిన అవసరం లేదనుకుంటాము. 'కౌముది' పత్రిక లోగోని డిజైన్ చేసి ఇచ్చింది చంద్ర గారే. చిత్రకారుడు చంద్ర మంచి రచయితకూడా అన్న విషయం చాలా మందికి తెలియక పోవచ్చు. ఆయన 40 సంవత్సరాల క్రిందట రాసిన కథని ఈ నెల 'అనగనగా ఒక మంచికథ' గా మీ ముందుకి తీసుకువస్తున్నాం.